ఉత్తమ ఆవిష్కరణలకు జస్ట్ ఏఐ అవార్డులు

ఎథికల్ ఏఐ అంశంపై ఆవిష్కరణలకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంతో రూపొందించే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జస్ట్ ఏఐ అవార్డుల ప్రదానం కార్యక్రమాన్ని రాష్ట్ర ఐటీ శాఖ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ నిర్వహిస్తోంది. వచ్చే నెలలో 5, 6 తేదీల్లో నిర్వహించే ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా సమాజానికి ఉపయోగపడేలా ఏఐతో రూపొందించే ఆవిష్కరణలను గుర్తించేందుకు ఈ పోటీని నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులు 'ఎథికల్ ఏఐ-సొల్యూషన్స్ ఫర్ సోషల్ గుడ్' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టులను ఆగస్టు 15 వరకు నామినేషన్‌కు పంపించాలని, మరిన్ని వివరాలకు ఈ కింది లింకు (https://bit.ly/3zTRsFB)లో సంప్రదించాలని ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ప్రతినిధి తెలిపారు.

బిల్లు చెల్లించినా..ఖాతాకు చేరట్లే

విద్యుత్ వినియోగదారుల ఆవేదన

సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): 'నా జూలై నెల విద్యుత్ బిల్లు చెల్లింపు ఇప్పటి వరకు జమ కాలేదు. ఇప్పుడు నాకు కొత్త బిల్లు వచ్చింది. మీరు నా రూ. 524.00ల మొత్తాన్ని క్రెడిట్ చేసే వరకు నేను ఈ నెల విద్యుత్ బిల్లును చెల్లించను.. ఉన్నతాధికారులకు బిల్లు చెల్లించినట్లు ఆధారాలు పంపినా సరి చేయలేదు.. ఇలా ఎందుకు ఆలస్యం అవుతోంది'... అంటూ ఓ విద్యుత్ వినియోగదారుడు సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తం చేస్తూ పోస్టు చేశారు. ఇలా ఒక్కరే కాదు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా మంది వినియోగదారులు బిల్లుల చెల్లింపులో ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారు. జూలై ప్రారంభానికి కొద్ది రోజుల ముందు థర్డ్ యాప్‌ల నుంచి చెల్లించే అవకాశాన్ని తొలగించడంతో కొన్ని రోజుల పాటు వినియోగదారులు ఇక్కట్లకు గురయ్యారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) ప్రత్యేకంగా సంస్థ మొబైల్ యాప్‌లోనే బిల్లుల చెల్లింపు ఆప్షన్ తీసుకువచ్చినా.. కొన్ని రోజుల పాటు సరిగా పనిచేయలేదు. కొందరు యాప్‌లో చెల్లింపులు చేస్తే సరైన స్పందన ఉండడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో మీ సేవా కేంద్రాలకు వెళ్లి కట్టాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.



జూలై 3న విద్యుత్ బిల్లు ఇంకా క్రెడిట్ కాలేదంటూ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఓ వినియోగదారుడు

మర్యాద పూర్వక కలయిక

తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్‌ను తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా మర్యాద పూర్వకంగా శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కండక్టర్లపై కేసులు ఎత్తివేయాలి

మహాలక్ష్మి పథకంతో కండక్టర్ల మీద ఒత్తిడి పెరిగిందని, వారిపై డిపార్ట్‌మెంట్ అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నదని వాటిని తక్షణమే ఆపాలని టీజీ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూఐఎన్టీయూసీ యూనియన్ నాయకులు సయ్యద్ మహ్మద్, అబ్రహం శనివారం ఆర్టీసీ ఎండీ సజ్జనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్మికుల గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని తెలిపారు.

- సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ);

ఎస్బీఐ లేడీస్ క్లబ్ సేవలు.. అనితర సాధ్యం

జూబ్లీహిల్స్, ఆగస్టు 3: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుల నుంచి సేకరించిన విరాళాలతో అనితర సాధ్యమైన సేవలందిస్తున్నారు. నగరంలోని మియాపూర్ వివేకానంద సేవా సంఘంలో క్లబ్ అధ్యక్షురాలు రష్మీ సిన్హా ఆధ్వర్యంలో శనివారం వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా సేవా సంఘానికి కిరాణా సామగ్రి, పిల్లలకు టీ షర్టులు, సీనియర్ సిటిజన్స్‌కు దుస్తులు అందజేశారు. ఎల్డర్లీ కేర్ వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు, బాలికలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మిలీ వర్మ, సెక్రటరీ అనిత శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై దృష్టి సారించండి

సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములు, భవనాలపై తహసీల్దార్లు దృష్టి సారించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ప్రభుత్వ భూముల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లతో మండలాల వారీగా పలు అంశాలపై సమీక్షించారు.

టీఎస్ఈఆర్‌సీ చైర్మన్ టి.శ్రీరంగారావును కలిసి వినతి పత్రాన్ని అందజేస్తున్న బి.అశోక్ కుమార్ తదితరులు

చరిత్ర ఖజానా.. తెలంగాణ

తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: సమస్త చరిత్ర పరిశోధకులకు తెలంగాణ రాష్ట్రం ఖజానా లాంటిదని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ యాన్షియెంట్ ఇండియన్ హిస్టరీ, కల్చర్ అండ్ ఆర్కియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్కియాలజీ కన్వర్జెన్స్ ఇన్‌టు మల్టీ ఇంటర్ ట్రాన్స్ డిసిప్లినరీ అప్రోచెస్' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మామిడి హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కియాలజీ అంటే మానవ సమాజ నిర్మాణ మూలాల్లోకి వెళ్లడమని చెప్పారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఆర్కియాలజీ పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని భవిష్యత్తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. హరప్పా నాగరికత నుంచి మొదలుకొని నేటి ఆధునిక నాగరికత పరిణామ క్రమంలో నేడు డిజిటల్ యుగంలోకి చేరుకున్నామని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు విజ్ఞాన వ్యాప్తిలో పరిశోధనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. ఓయూ మాజీ రిజిస్ట్రార్, ఆర్కియాలజీ విభాగం మాజీ హెడ్ ప్రొ. కిషన్ రావు మాట్లాడుతూ, చరిత్ర రచనలకు ఆర్కియాలజీ పరిశోధనలు కీలకమని అన్నారు. ఆర్కియాలజీ పరిశోధక విద్యార్థి మేడి దివ్య రాసిన 'మెగాలిథిక్ బరియల్స్ ఇన్ తెలంగాణ' అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు డైరెక్టర్ ప్రొ.లావణ్య, కన్వీనర్ డా.యాలాల శివానంద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.తలత్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ డా.బీనవేణి రామ్ షెఫర్డ్, ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ.రాములు, జర్నలిజం విభాగం హెడ్ డా. టి.సతీశ్ కుమార్, ఆడిట్ సెల్ జేడీ డా. రమేశ్, డా. రామలింగం, పరంధాములు, సోమేశ్వర్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సదస్సు నిర్వాహకులు

బస్సుల కోసం తప్పని తిప్పలు

సిటీ బస్సులు సరిపోయేంత లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. ఉన్న సర్వీసుల్లో కూడా విపరీతంగా రద్దీ ఉంటుండడంతో తిప్పలు తప్పడం లేదు.

సోలార్‌పై స్పష్టమైన అవగాహన అవశ్యం

తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్

సిటీబ్యూరో, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై కొత్తగా అమలు చేస్తున్న విధి విధానాలపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు బి.అశోక్ కుమార్ కోరారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్‌సీ) చైర్మన్ టి.శ్రీరంగారావును కలిసి శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం, సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఓపెన్ యాక్సెస్ నిబంధనను అమల్లోకి తీసుకువచ్చిందని, దీనిపై సోలార్ పవర్ ఉత్పత్తిదారులకు స్పష్టమైన అవగాహన లేదని, ఇదే విషయమై చైర్మన్‌ను కలిసి వివరాలు అడిగామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తోట ప్రసాద్, రాజేశ్ పరకాల, శ్రీహరిబాబు, బాబు నాయుడు, కె.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జూపాక సుభద్ర రచించిన తెలంగాణ మహిళా గొంతు తెలంగాణి పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ పత్రికా సంపాదకులు కే శ్రీనివాస్, చిత్రంలో బీఎస్ రాములు, జూపాక సుభద్ర, విజయ, డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు, డాక్టర్ అంబటి సురేంద్ర రాజు, తదితరులు

నగరంలోని దస్‌పల్లా హోటల్‌లో శనివారం సింబ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పాల్గొన్న వనం రామయ్య దంపతులను ఆప్యాయంగా పలకరిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, చిత్రంలో తదితరులు

వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

సెయింట్ ఫౌండర్, చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి ఘనంగా ఎస్సార్ వర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవం

సినీ నటుడు తనికెళ్ల భరణికి డాక్టరేట్ ప్రదానం

తనికెళ్ల భరణికి డాక్టరేట్ అందిస్తున్న సైయ్యంట్ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఎస్సార్‌యూ చైర్మన్ వరదారెడ్డి, తదితరులు

హసన్‌పర్తి, ఆగస్టు 3: వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమని సెయింట్ టెక్నాలజీస్ ఫౌండర్, చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో చైర్మన్ వరదారెడ్డి అధ్యక్షతన ద్వితీయ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య అవగాహన ఎంతో అవసరమన్నారు. విలువలతో కూడిన సాంకేతికతతో అమెజాన్, ఆపిల్, మెక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ముందు వరుసలో నిలిచాయన్నారు. నగరంలోని యువతకు ఉద్యోగావకాశాలు పెంచాలనే ఉద్దేశంతో తన సాఫ్ట్‌వేర్ కంపెనీ సెయింట్ బ్రాంచ్‌ను మడికొండలో (వరంగల్) కూడా ఏర్పాటు చేశానని చెప్పారు. చైర్మన్ వరదారెడ్డి మాట్లాడుతూ.. 2002లో తాను స్థాపించిన ఇంజినీరింగ్ కళాశాల ఎన్నో మైలురాళ్లను దాటి విశ్వవిద్యాలయం స్థాయికి చేరిందన్నారు. నాణ్యమైన విద్యను అందించడం వల్ల న్యాక్, ఏబీసీ అక్రిడిటేషన్, నిర్ఫ్(NIRF) ర్యాంకింగ్ సాధించినట్లు తెలిపారు. సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణికి ఈ సందర్భంగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన 750కి పైగా తమిళ, తెలుగు, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించడంతో పాటు కవి, రచయిత, దర్శకుడిగా సినిమా రంగానికి చేసిన సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశామన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైన ఎం.టెక్, ఎంబీఏ, బీటెక్, బీబీఏ, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు పట్టాలు అందించారు. అనంతరం, తనికెళ్ల భరణి మాట్లాడుతూ, తన జీవితంలో ఈ డాక్టరేట్ ఒక మైలురాయిగా నిలిచిందని, దీనిని తన జీవిత భాగస్వామి భవానీకి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీసీ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, కోర్ కమిటీ మెంబర్ మహేశ్, డీన్ రాందేవ్ ముఖ్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ప్రామాణిక పుస్తకాలు

తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకరించేలా గ్రంథాలు

పలు పుస్తకాలను ఆవిష్కరించిన తెలుగు అకాడమీ డైరెక్టర్ దేవసేన

పోటీ పరీక్షల ప్రామాణిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ దేవసేన

జూబ్లీహిల్స్, ఆగస్టు 3: గ్రూప్ - 1 మెయిన్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం తెలుగు మాధ్యమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రూప్స్, ఎస్సై, కానిస్టేబుల్, డీఎస్సీ వంటి నియామక పరీక్షలలో విద్యార్థులకు ఉపకరించేలా ప్రామాణిక గ్రంథాలను ప్రచురించడంలో తెలుగు అకాడమీ విశేషమైన కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కీలకమైన ఈ పుస్తకంతో పాటు తదితర పోటీ పరీక్షల ప్రామాణిక గ్రంథాలను, విద్యా సంబంధిత పుస్తకాలను తెలుగు అకాడమీ సంచాలకులు, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఏ.దేవసేన శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం, అకాడమీ రీసెర్చ్ అసిస్టెంట్స్ వేదవ్యాస్, శైలజ, అరుంధతి, రచయితలు అందె సత్యనారాయణ, డాక్టర్ మోదాల మల్లేశ్, ఎడిటర్ రాఘవేందర్‌రావు, డాక్టర్ పిడిగం సైదయ్య, పలువురు సాహితీవేత్తలు, పుస్తక అభిమానులు పాల్గొన్నారు.

గ్రేటర్ @30.8 డిగ్రీలు

సిటీబ్యూరో, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు నగరంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు నగర వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, రెండు రోజులుగా నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 30.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 24.4 డిగ్రీలు, గాలిలో తేమ 64 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సింపోజియం

సింపోజియంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, లక్ష్మి సుందరి చావలి, రిషీ వర్మ, డైరెక్టర్ వినయ్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంకలు

అబిడ్స్, ఆగస్టు 3: స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సింపోజియం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులతో ఫాస్టరింగ్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ ఎంపవరింగ్ ఇంజనీర్స్ విత్ కార్పొరేట్ లీడర్‌షిప్ అనే పేరుతో సింపోజియంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొని ప్రసంగిస్తూ సింపోజియం ఇంజనీరింగ్ విద్యార్థులకు అవసరమైన కార్పొరేట్ నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తుందన్నారు. ఎల్‌టీఐ మైండ్ ట్రీ సీనియర్ డైరెక్టర్ లక్ష్మి చావలి, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ రిషి వర్మలు మాట్లాడుతూ, వ్యవస్థాపక ఆలోచన, ఇంజనీరింగ్ రంగంలో దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏ.వినయ్‌బాబు, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, కో ఆర్డినేటర్స్ డాక్టర్ వైవీఎస్ ప్రగతి, డాక్టర్ శివాని యాదవ్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలేఖ కూచిపూడి అరంగేట్రం..

శ్రీలేఖ మామిడాల కూచిపూడి నృత్య అరంగేట్రం విల్లింగ్టన్ ది బేబీ గ్రాండ్ 818 ఎన్ మార్కెట్ సెయింట్‌లో శనివారం ఘనంగా జరిగింది. ప్రదర్శనకు నృత్య శిక్షకురాలు కళానంద డాక్టర్ మాధవీ రత్నగిరి, శ్రీలేఖ తాత ప్రొఫెసర్ రామా చంద్రమౌళి హాజరయ్యారు.

- జూబ్లీహిల్స్, ఆగస్టు 3;

హయత్‌నగర్‌లో రిలయన్స్ డిజిటల్..

హయత్‌నగర్‌లో రిలయన్స్ డిజిటల్ నూతన స్టోర్‌ను ప్రముఖ నటి నభా నటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు ప్రముఖ నటితో గ్రీట్ అండ్ మీట్‌లో పాల్గొని ఎక్స్‌క్లూజివ్ సంతకంతో సరుకులను అందుకునే అవకాశం కల్పించారు. స్టోర్ ప్రారంభం సందర్భంగా ఎర్లీ బర్డ్ ఆఫర్‌ను అందిస్తూ ప్రముఖ బ్యాంక్ కార్డులపై 10 శాతం తక్షణ తగ్గింపు ఆఫర్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ స్టోర్‌లో 500లకు పైగా అంతర్జాతీయ, జాతీయ బ్రాండ్లకు చెందిన రెండు వేలకు పైగా ఉత్పత్తులు అందిస్తున్నట్లు ప్రకటించారు.

- జూబ్లీహిల్స్, ఆగస్టు 3;

కార్పొరేట్ వర్కింగ్ ఉమెన్‌కు షీ క్లినిక్స్

జూబ్లీహిల్స్, ఆగస్టు 3: మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ కార్పొరేట్ వర్కింగ్ ఉమెన్‌కు, వారి కుటుంబ సభ్యులకు షీ క్లినిక్స్‌లో 'కాంప్లిమెంటరీ హెల్త్ చెక్ ప్యాకేజీ' ఆఫర్‌ను హ్యాష్‌ట్యాగ్ మార్కెటింగ్ వ్యవస్థాపకురాలు గుల్నార్ విర్క్ కృష్ణ, ఫిట్నెస్ అండ్ వెల్నెస్ చీఫ్ లీగల్ ఆఫీసర్ ఇషా సిన్హాతో కలిసి ప్రారంభించారు. కుటుంబంలో ఒత్తిడి అధికమవడం, క్రమశిక్షణతో కూడిన లైఫ్‌స్టైల్ లేని కారణంగానే కాక ఇతర ప్రభావాలతో ప్రత్యేకించి మహిళలకు అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయన్నారు. అంతే కాక వయస్సు, శారీరక వ్యాధులు, మానసిక ఒత్తిళ్లు చివరికి ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతాయన్నారు. మహిళలు తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందుకు గాను ప్రతి శనివారం ఉచిత గైనకాలజిస్ట్ కన్సల్టేషన్, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, అన్ని పరీక్షలపై 30 శాతం డిస్కౌంట ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు, వారి కుటుంబ సభ్యులు ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షలకు వచ్చేటప్పుడు కంపెనీ ఐడీ తీసుకురావాలని సూచించారు.